సాక్షి
బాపట్ల
గురువారం । 24 । ఏప్రిల్ । 2025



రెడ్డి పేరంటాలమ్మకు పూజలు

నాదెండ్ల: సాతులూరులో రూ.2 కోట్లతో నిర్మించిన శ్రీ రెడ్డిపేరంటాలమ్మ ఆలయంలో గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి పూజలు నిర్వహించారు.



త్రికోటేశ్వర విగ్రహ పునఃజీవ ప్రతిష్ట

సత్తెనపల్లి: అమ్మిశెట్టి వారి వీధిలోని త్రికోటేశ్వర స్వామి విగ్రహ పునఃజీవ ప్రతిష్ట, దేవాలయం పునర్నిర్మాణం, ధ్వజస్తంభ ప్రతిష్ట బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ముగిసిన ప్రతిష్ట వేడుకలు



శావల్యాపురం: వేల్పూరులోని గంగమ్మ తల్లి, పోతురాజుల పేర్పిడి ప్రతిష్టా మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. భక్తులు భారీసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

సూదివారిపాలెం సర్పంచ్‌కు పంచాయతీ రాజ్ అవార్డు



ఇంకొల్లు(చిన గంజాం): జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా మండలంలోని సూదివారిపాలెం గ్రామ సర్పంచ్ గోరంట్ల జయలక్ష్మికి కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో అవార్డు ప్రదానం చేశారు. ఢిల్లీలో మంగళవారం నిర్వహించిన పంచాయతీ రాజ్ దివస్ కార్యక్రమంలో కేంద్ర జలశక్తి వనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకున్నారు. రాష్ట్ర స్థాయిలో ఆదర్శ గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం ప్రదానం చేస్తున్న రాష్ట్రీయ గౌరవ గ్రామ సభ అవార్డుతో ఆమెను సత్కరించారు.

చైర్మన్‌పై అవిశ్వాసానికి కలెక్టర్‌కు నోటీసు



చీరాల: చీరాల మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుపై అవిశ్వాసం ప్రకటిస్తూ బుధవారం టీడీపీకి మద్దతు పలికిన కౌన్సిలర్లు 17 మంది కలెక్టర్‌కు నోటీసు అందించారు. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి తేదీని ఖరారు చేయాలని వారు కలెక్టర్‌ను కోరారు. ఎన్నికల కమిషన్ అనుమతితో తదుపరి చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు.

వీరయ్య చౌదరి హత్య కేసులో రేషన్ మాఫియా?

- పోలీసుల అదుపులో వెదుళ్లపల్లి రైస్‌మిల్లు యజమాని
- ఆరా తీస్తున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మాజీ ఎంపీపీ వీరయ్య చౌదరి హత్య కేసులో రేషన్ మాఫియా పాత్రపై పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. హత్య కేసును విచారిస్తున్న పోలీసులకు రేషన్ మాఫియాపై అనుమానాలు తలెత్తినట్లు సమాచారం. నాగులుప్పలపాడుకు చెందిన చౌక బియ్యం వ్యాపారితో వీరయ్య చౌదరికి విభేదాలున్నాయి. ఆ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతనితో కలిసి వ్యాపారం చేసిన పలువురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. అందులో భాగంగా బాపట్ల నియోజకవర్గంలోని వెదుళ్లపల్లికి చెందిన రైస్‌మిల్లు యజమానిని కూడా విచారిస్తున్నట్లు తెలుస్తోంది. వీరయ్య చౌదరి హత్యలో నిజంగా రేషన్ మాఫియా హస్తం ఉందా లేక మరేదన్నా కారణమా? అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

పోలీసుల అదుపులో ముగ్గురు..?

పొన్నూరు: పట్టణంలోని నిడుబ్రోలుకు చెందిన గోపి, అమీర్, అశోక్ అనే ముగ్గురిని ఒంగోలు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ప్రకాశం జిల్లాలో జరిగిన టీడీపీ నేత వీరయ్య చౌదరి హత్య కేసులో వీరి పాత్రపై అనుమానంతో తీసుకువెళ్లినట్లు తెలిసింది. ఈ ముగ్గురు వెదుళ్లపల్లి మిల్లుకు రేషన్ బియ్యం రవాణా చేస్తున్నట్లు, ఈ క్రమంలో వీరి ప్రమేయంపై అనుమానంతో అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

నేటి నుంచి టీచర్ల సర్టిఫికెట్ల పరిశీలన

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో సాధారణ బదిలీల కోసం పెట్టుకునే ప్రభుత్వ టీచర్ల సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు మూడు రోజులపాటు జరుగుతుందని సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ తెలిపారు. వైద్య పరీక్షలు చేయించుకునేందుకు ప్రతి ఒక్కరూ జీజీహెచ్ ఆసుపత్రి అభివృద్ధి సంఘం కౌంటర్‌లో రూ. 1,500 ఫీజు చెల్లించాలన్నారు. అభ్యర్థులు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఉద్యోగ గుర్తింపు కార్డు తీసుకుని ఉదయం 9 నుంచి 12 గంటల మధ్య కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 99637 66638 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం

తెనాలి టౌన్: భక్తుల కొంగు బంగారమై కోరిన కోర్కెలు తీర్చే పోలేరమ్మ కరుణ, కటాక్షాలు ప్రజలందరిపై మెండుగా ఉండాలని ఆలయ ధర్మకర్త వీరయ్య ఆకాంక్షించారు. పట్టణ వైకుంఠపురం రోడ్డులోని పోలేరమ్మ దేవస్థానం 27వ వార్షికోత్సవాలు మంగళ, బుధవారాలు కన్నులపండువగా నిర్వహించారు. మేళ తాళాలు, కనక తప్పెట్లు, కాళికా వేషధారణలతో పురవీధుల్లో ఊరేగింపు ఉత్సవం నిర్వహించారు.

పచ్చ నేతల పైసావసూల్

వేట నిషేధ భృతి కొట్టేసేందుకు స్కెచ్

- తాము చెప్పిన వారికే భరోసా ఇవ్వాలంటూ హుకుం
- అధికారులపై నిజాంపట్నం, బాపట్ల, చీరాల నేతల ఒత్తిడి
- రూ. కోట్లలో ప్రజాధనం దోపిడీకి రంగం సిద్ధం
- జిల్లాలో 2,834 బోట్లు
- బోటుకు కనీసం రెండు నుంచి మూడు అదనపు పేర్ల నమోదు చేయాలని హుకుం
- అర్హులైన మత్స్యకారులకు మొండి చేయి
- పచ్చ నేతల తీరుతో తలలు పట్టుకుంటున్న అధికారులు



నిషేధ సమయంలో బాపట్ల సముద్ర తీరంలో వలలు అల్లుకుంటున్న మత్స్యకారులు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: మత్స్యకారుల వేట నిషేధ భృతిపై పచ్చనేతల కన్నుపడింది. ఇప్పటివరకూ ఇసుక, బుసక, గ్రానైట్, గ్రావెల్, పేదల బియ్యం మాత్రమే బొక్కుతున్నారు. ఇప్పుడు చేపల వేట జీవనాధారంగా బతికే గంగ పుత్రులకు ప్రభుత్వం ఇచ్చే వేట నిషేధ భృతిని కొట్టేసేందుకు సిద్ధమయ్యారు. ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు వేట నిషేధంలో జీవన భృతి కోసం ప్రభుత్వం గంగ పుత్రులకు ఆర్థిక సహాయం అందిస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చాక దీని మాటున డబ్బులు కొట్టేసేందుకు పచ్చ నేతలు సిద్ధమయ్యారు. ఒక్కో బోటుకు ఇద్దరు లేదా ముగ్గురి పేర్లు అదనంగా చేర్చి ఆ మొత్తాన్ని తమకు చెల్లించాలని మత్స్యశాఖ అధికారులపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం.

అధికారులకు బెదిరింపులు

ఇప్పటికే నిజాంపట్నానికి చెందిన ఒక పచ్చ నేత ఏకంగా మత్స్యశాఖ కార్యాలయానికి వెళ్లి అధికారులను బెదిరించినట్లు ఆ శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి. చెప్పిన పేర్లన్నీ భృతి జాబితాలో ఉండాల్సిందేనని, లేకపోతే ఉండరంటూ సదరు నేత హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. ఇదే తరహాలో బాపట్ల, చీరాల ప్రాంతాలకు చెందిన మరికొందరు నేతలు బెదిరించినట్లు తెలుస్తోంది. మాట వినకపోతే ఎమ్మెల్యేలు లేదా మంత్రులతో ఫోన్‌లు చేయిస్తామంటూ మత్స్యశాఖ అధికారులను భయభ్రాంతులకు గురి చేసినట్లు సమాచారం. అవసరమైతే కొంతవాటా ఇస్తామని ప్రలోభపెట్టినట్లు సమాచారం. కొందరు ఒత్తిళ్లకు తలొగ్గి వారిచ్చిన పేర్లను జాబితాలో చేర్చినట్లు సమాచారం. బుధవారం సాయంత్రమే జిల్లా నుంచి మత్స్యశాఖ అధికారులు జాబితాను ఉన్నతాధికారులకు పంపినట్లు సమాచారం.

జాబితా 15 వేలకు చేరే అవకాశం

వాస్తవానికి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు 2022లో జిల్లా వ్యాప్తంగా 9వేల మందికి, 2023లో 10వేల మంది వరకూ జాబితా సిద్ధం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఏడాది 14 వేల మంది పైచిలుకు భృతి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. బుధవారం నాటికి తుది జాబితాను అధికారులు వెల్లడించలేదు. పచ్చనేతల ఒత్తిళ్లతో జాబితా 15 వేలకు చేరే అవకాశమున్నట్లు సమాచారం. ఇదే జరిగితే వేల సంఖ్యలో పచ్చ నేతలు బోగస్ మత్స్యకారుల పేర్లను జాబితాలో చేర్చినట్లు అనుమానించాల్సిందే.

జాబితాలో అదనంగా నాలుగు వేల మంది..

గత ప్రభుత్వంలో ఇచ్చిన దానితో పోల్చుకున్నా నాలుగు వేల మందిని అదనంగా జాబితాలో చేర్చినట్లు తెలుస్తోంది. ఈ లెక్కన ఒక్కొక్కరికీ రూ. 20 వేలు అనుకుంటే నాలుగు వేల మందికి సుమారు రూ. 8 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ మొత్తం పచ్చనేతలు కొట్టేసేందుకు సిద్ధమైనట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి అర్హులైన మత్స్యకారులకు భృతి ఇస్తే సంతోషమే. అలా కాకుండా పచ్చనేతల జేబులు నింపడానికి రూ. కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం సరికాదని విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. మరోవైపు వైఎస్సార్ సీపీ సానుభూతి పరులంటూ పచ్చనేతలు కొందరు అర్హులైన మత్స్యకారులకు వేట నిషేధ భృతి అందకుండా చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమాలు జరగకుండా చర్యలు చేపట్టాలని, అర్హులైన మత్స్యకారులందరికీ భృతి ఇవ్వాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు.

పచ్చనేతల దోపిడీ ఇలా ...

- వాస్తవానికి జిల్లాలో నిజాంపట్నం హార్బర్, బాపట్ల, చీరాల ప్రాంతాల్లో అధికారికంగా 2,432 మోటరైజ్డ్ బోట్లు, 174 మెకనైజ్డ్ బోట్లు, 228 నాన్ మోటరైజ్డ్ బోట్లు కలిపి మొత్తం 2,834 ఉన్నాయి.
- మోటరైజ్డ్ బోట్లలో ఆరుగురు, మెకనైజ్డ్ బోట్లలో ఎనిమిది నుంచి పది మంది, నాన్ మోటరైజ్డ్ బోట్లలో ముగ్గురు తగ్గకుండా మత్స్యకారులు వేట సాగిస్తారు. పచ్చనేతల ఒత్తిళ్లతో మోటరైజ్డ్, మెకనైజ్డ్ బోట్లలో అదనంగా ఒక్కో బోటుకు ముగ్గురికి తగ్గకుండా పేర్లను పచ్చనేతలు భృతి జాబితాలో చేర్పించినట్లు సమాచారం.

గంజాయి, డ్రగ్స్ రవాణాపై ఉక్కుపాదం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్



కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: జిల్లాలో గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టాలని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశం బుధవారం ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, మాదకద్రవ్యాలను సరఫరా చేసే వారిపై పీడీ యాక్ట్ కేసులు పెట్టాలని చెప్పారు. ప్రభుత్వ కాలేజీల్లో గంజాయి తీసుకునే వారి వివరాలను సేకరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రజల సహకారంతో గంజాయి సరఫరా చేసే వారిని పట్టుకోవాలని తెలిపారు. జిల్లాలో గంజాయి, మాదక ద్రవ్యాలను సరఫరా చేసే వారిపై దాడులు నిర్వహించి, వారికి అవగాహన కల్పించాలని ఆయన చెప్పారు. గ్రామ, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో గంజాయి వినియోగించే వారి వివరాలను గ్రామ సచివాలయ సిబ్బంది సేకరించాలని చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన 1972 టోల్ ఫ్రీ నంబర్‌కు ప్రజలు కూడా ఫిర్యాదు చేయవచ్చని ఆయన సూచించారు. వివరాలను గోప్యంగా ఉంచుతాయని తెలిపారు. జిల్లాలోని నాలుగు లక్షల కుటుంబాలకు గంజాయి, డ్రగ్స్ నియంత్రణపై అవగాహన తెలియజేసే వాల్‌పోస్టర్లు, కరపత్రాలు ప్రచురించి పంపిణీ చేయాలని ఆయన అధికారులు సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ విఠలేశ్వర్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దిబోరా, జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి విజయమ్మ, జిల్లా రవాణాశాఖ అధికారి పరంధామరెడ్డి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల అభ్యున్నతే లక్ష్యం

బంగారు కుటుంబాలను పేదరికం నుంచి బయటకి తెచ్చేలా మార్గదర్శులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. పీ-4 అమలుపై జిల్లా, మండల ప్రత్యేక అధికారులు, మండల స్థాయి అధికారులతో బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన బుధవారం సమావేశం నిర్వహించారు. జిల్లాలో 62,291 బంగారు కుటుంబాలు ఉన్నాయని, వాటిని పేదరికం నుంచి బయటకు రావడానికి చేయూతనందించాలని ఆదేశించారు. పీ-4 అమలుకు జిల్లా, మండల, గ్రామస్థాయిలో కమిటీలు నియమిస్తామని పేర్కొన్నారు. ఒక్కో మండలంలో సుమారు 500 బంగారు కుటుంబాలు ఉన్నాయని, వీటిల్లో యువతకు నైపుణ్యాల అభివృద్ధిపై అవగాహన కల్పించాలని సూచించారు. పింఛన్ పంపిణీ ప్రక్రియ ముగిసిన తక్షణమే మిగిలిన నగదును ప్రభుత్వానికి చెల్లించాలని చెప్పారు. సంతమాగులూరు మండలంలో రూ.6.41 లక్షలను ఎందుకు చెల్లించలేదని అధికారులను నిలదీశారు. బాపట్ల, బల్లికురవ, మార్టూరు, వేటపాలెం, నిజాంపట్నం మండలాలలోను నగదు పక్కదారి పడితే బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోలేదంటూ సంబంధిత అధికారులను ప్రశ్నించారు. తక్షణమే బాధ్యులను సస్పెండ్ చేయాలని, వారిపై కేసు పెట్టి ఎఫ్ఐఆర్ నమోదుతో చార్జ్‌షీట్ పంపాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్‌గౌడ్, సీపీఓ కె. శ్రీనివాసరావు, డీఆర్‌డీ ఎఫ్‌సీ డి. శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

'సాక్షి'పై దాడి అప్రజాస్వామికం



కలెక్టర్ వెంకట మురళికి వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు



ఏఎస్పీ విఠలేశ్వర్‌కు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

- ఆగ్రహించిన జర్నలిస్టులు
- బాధ్యులపై కఠిన చర్యలకు డిమాండ్
- ఏలూరు సాక్షి కార్యాలయంపై చింతమనేని అనుచరుల దాడి హేయం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో సాక్షి దినపత్రిక కార్యాలయంపై దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అనుచరులతో దాడిచేసి కంప్యూటర్లు, ఫర్నీచర్ ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ బుధవారం బాపట్లలో జర్నలిస్టులు నిరసన తెలిపారు. దాడి ఘటనను తీవ్రంగా ఖండించారు. ఇది అప్రజాస్వామికమని తప్పుబట్టారు. బాధ్యతాయుత ప్రజాప్రతినిధులు పత్రికా కార్యాలయంపై దాడికి దిగడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. దాడికి నిరసనగా బుధవారం పాత్రికేయులు జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. జర్నలిస్టులపై దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. దాడి చేసిన వారిపై తక్షణం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసులు పెట్టి, దాడులు చేసి పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేయాలనుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ వెంకటమురళి, ఏఎస్పీ విఠలేశ్వర్‌లకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పాత్రికేయులు బిజివేముల రమణారెడ్డి, ఆర్. ధనరాజ్, రాఘవ, కె. ప్రశాంత్, ఉమామహేశ్వరరావు, పి.వెంకట్, అంజయ్య, గణేష్, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, రవితేజ, అన్నాధరావు, చంటి, బొట్టు కృష్ణ, సాల్మన్‌రాజు, మరియదాసు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుల శాంతి ర్యాలీ

- పెహల్గాం మృతులకు ఘన నివాళి
- టెర్రరిస్టులను కఠినంగా శిక్షించాలి



ప్రదర్శనలో వైఎస్సార్ సీపీ నాయకులు

బాపట్ల: పెహల్గాం మృతుల ఆత్మ శాంతించాలని, టెర్రరిస్టులను కఠినంగా శిక్షించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం ప్రదర్శన చేపట్టారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి పురవీధుల్లో కొవ్వొత్తులతో ప్రదర్శన చేపట్టారు. ప్రదర్శనను ఉద్దేశించి వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు మాట్లాడుతూ పెహల్గాంలో పర్యాటకులను దారుణంగా హత్య చేయడం సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునే ఘటనగా పేర్కొన్నారు. టెర్రరిస్టుల అణచివేతకు కఠిన చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు మరుప్రోలు ఏడుకొండల రెడ్డి, నాయకులు గవిని కృష్ణమూర్తి, కొక్కిలిగడ్డ చెంచయ్య, చల్లా రామయ్య, తన్నీరు అంకమ్మ, ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు, కటికల యోహోషువా, వడ్డిముక్కల డేవిడ్ పాల్గొన్నారు.

ప్రధాని సభకు సిద్ధం కండి

నరసరావుపేట: రాష్ట్ర రాజధాని అమరావతిలో మే 2న జరగనున్న ప్రధాని నరేంద్ర మోదీ సభ కోసం సన్నద్ధం కావాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా అధికారులతో ఆయన మాట్లాడారు. జిల్లా నుంచి 30వేల మంది సభకు హాజరవనున్నట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నామన్నారు. ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుని నియోజకవర్గం, మండలం, గ్రామ-వార్డు సచివాలయ స్థాయిల నుంచి ఎంత మంది ప్రజలు ఏయే మార్గాన సభకు వెళ్లనున్నారో వివరాలు సేకరించాలన్నారు. 600 బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. భోజన వసతి, ఎండలను దృష్టిలో ఉంచుకుని చల్లని తాగునీరు, మజ్జిగ అందించాలన్నారు. జేసీ సూరజ్ ధనుంజయ్ గనోరే, డీఆర్వో ఎ.మురళి, డీఎఫ్ఓ కృష్ణప్రియ పాల్గొన్నారు.

జిల్లా విద్యార్థులు సత్తా చాటెన్

జిల్లాలో 83.96 శాతం ఉత్తీర్ణత

బాపట్ల: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. ఉపాధ్యాయులు, విద్యాశాఖాధికారుల కృషి ఫలించింది. జిల్లాలో 83.96 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు విద్యాశాఖాధికారి పురుషోత్తం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 212 నుంచి 9,235 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 8,229 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలలు 126 ఉన్నాయన్నారు. వీటిల్లో 6,947మందికి గానూ 5,357మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. మొత్తంగా చూస్తే జిల్లాలో 83.96శాతం ఉత్తీర్ణత సాధించామని డీఈఓ పురుషోత్తం వెల్లడించారు. వీరిలో బాలురు 6,615మంది, బాలికలు 6,971 ఉన్నారని వివరించారు. బాలురు ఉత్తీర్ణత 81.24 శాతం కాగా బాలికలు 86.71శాతం ఉందని ఆయన వివరించారు.



శ్రీ ప్రణస్య | షేక్ జహూర | సిహెచ్ హారిక | ఎస్ .నాగమస్వి

చైతన్య విద్యార్థినికి ఫస్ట్ ర్యాంక్

బాపట్ల పట్టణంలో శ్రీ చైతన్య విద్యార్థిని శ్రీ ప్రణస్య (596) మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. సరస్వతి స్మారక బాలికల ఉన్నత పాఠశాల (ఎస్ఎంజీ) విద్యార్థిని షేక్ జహూర 593 మార్కులు, జెమ్స్ హైస్కూల్ విద్యార్థినులు సీహెచ్. హారిక 593 మార్కులు, ఎస్. నాగ మనస్వి 592 మార్కులు సాధించారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎస్ఎంజీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, జెమ్స్ హైస్కూల్ డైరెక్టర్ ఆదెళ్ల విజయ్ కుమార్, శ్రీ చైతన్య ప్రిన్సిపాల్ మాధురి, పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

నారాయణ విద్యార్థినికి రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు

చీరాల అర్బన్ : చీరాలలోని నారాయణ స్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటారు. మాచవరపు సాహిత్య 598 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు, జిల్లాలో ప్రథమ ర్యాంకు కైవసం చేసుకుంది. ఉపాధ్యాయుల బోధన, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే రాష్ట్రస్థాయిలో ర్యాంకు సాధించానని విద్యార్థిని తెలిపింది. విద్యార్థిని తండ్రి ఎం.సత్యనారాయణ ఉద్యోగి కాగా, తల్లి అనంతలక్ష్మి రెవెన్యూ డిపార్టుమెంట్‌లో పని చేస్తున్నారు. ఈ సందర్భంగా సాహిత్యను స్కూల్ యాజమాన్యం, తల్లిదండ్రులు అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.నిరుపమ, ఏజీఎం శ్రీనివాస్, మూర్తి పాల్గొన్నారు.



సాహిత్యను అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని రికార్డు



సజ్జా దివ్యశ్రీ

వేటపాలెం: పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో పదో తరగతి విద్యార్థిని సజ్జా దివ్యశ్రీ 596 మార్కులతో రికార్డు సృష్టించింది. బాలికది చేనేత కుటుంబం. తండ్రి రామకృష్ణ 104లో తాత్కాలిక ఉద్యోగిగా పని చేస్తున్నారు. దివ్యశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వం స్కూల్స్‌లో ఉత్తమ బోధన అందిస్తున్నారని, వంద రోజుల యాక్షన్ ప్లాన్ ఎంతగానో ఉపయోగపడినట్లు తెలిపింది. ఎస్‌పీఈసీ (స్పెషన్ చానల్ ఫర్ ఎడ్యుకేషన్) ఎంట్రన్స్ పరీక్షలు రాసి హైదరాబాదులోని ఐఐటీలో కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ చదువడమే లక్ష్యమని పేర్కొంది.

రాష్ట్రంలో కూటమి లిక్కర్ మాఫియా

- టీడీపీ నాయకులకే మద్యం దుకాణాల అప్పగింత
- వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు



నగరంపాలెం (గుంటూరు వెస్ట్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక లిక్కర్ మాఫియా కొనసాగుతోందని బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు మండిపడ్డారు. గుంటూరు బృందావన్‌గార్డెన్స్ వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎన్టీఆర్ మద్యపానం నిషేధించగా, చంద్రబాబు ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి మద్యం పాలసీ తీసుకువచ్చారని ఆరోపించారు. చంద్రబాబు హయాంలో సారాయి, మద్యం ఏరులై ప్రవహిస్తోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మాజీ సీఎం వైఎస్ జగన్ హయాంలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేశారని తెలిపారు. టీడీపీ నాయకులకే మద్యం దుకాణాలను అప్పగించారని ఆరోపించారు. అందులో మంత్రులు, ఎమ్మెల్యేలకు 30శాతం వాటా, ఊరికి ఎనిమిది బెల్ట్ షాప్‌లు, పర్మిట్ రూంలను ఏర్పాటు చేశారని మండిపడ్డారు. రూ.వేల కోట్లు టీడీపీ నేతల చేతుల్లో మారుతున్నాయని ఆరోపించారు. చంద్రబాబు గతంలో బెల్ట్‌షాపులు రద్దు చేస్తామని తొలి సంతకం చేశారని, ఆ వాగ్దానాన్ని తుంగలో తొక్కారని అశోక్‌బాబు విమర్శించారు. వైఎస్ జగన్ హయాంలో 43 వేల బెల్ట్ షాప్‌లను రద్దు చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో సుమారు 4,300 మద్యం దుకాణాలు ఉండగా వైఎస్ జగన్ హయాంలో 33 శాతం తగ్గించారని తెలిపారు. మద్యం దుకాణాలన్నీ టీడీపీ నాయకులకు వచ్చేలా చేశారని, క్వాటర్ బాటిల్‌కు అదనంగా రూ.20 లబ్ధి చేకూర్చేలా చేశారని మండిపడ్డారు. బెల్టు షాప్‌లు ఏర్పాటుకు సైతం లంచం కింద రూ.2 లక్షలు చెల్లిస్తున్నారని, తద్వారా తాగునీటి సీసాల విక్రయాలు, పర్మిట్లు ఇస్తున్నారని విమర్శించారు. గతంలోని మద్యం పాలసీపై చంద్రబాబు ఏ-3 గా ఉన్నారని, ఆ కేసు ఏమైందనేది చూసుకోవాలని అన్నారు. రాజ్ కసిరెడ్డితో పాటు ఆ కేసులో వైఎస్ జగన్‌ను ఇరికించేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్‌లతో బలవంతంగా రాజ్ కేసిరెడ్డి పేరు చెప్పించారని అశోక్‌బాబు ఆరోపించారు.

క్లుప్తంగా

జనసేన నాయకుడిపై అట్రాసిటీ కేసు నమోదు

వేమూరు: దళితులను కులంతో దూషించి, చెప్పుతో కొట్టిన జనసేన నాయకుడిపై ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ ఆంజనేయులు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని చావలి గ్రామానికి చెందిన నియోజకవర్గ జనసేన కన్వీనర్ ఊసా రాజేష్ ఎస్సీ కార్పొరేషన్ రుణాలపై మాట్లాడాలని అదే గ్రామానికి చెందిన కొండయ్యను హిందూ శ్మశానవాటికకు రావాలని ఫోన్ ద్వారా పిలిచాడు. దళితవాడకు చెందిన ముగ్గురు వ్యక్తులు మంగళవారం రాత్రి అక్కడకు వచ్చారు. ఈ సమయంలో మాటామాట పెరిగి రాజేష్ కొండయ్యను కులంతో దూషించి, చెప్పుతో కొట్టాడు. దీంతో దళితులు మంగళవారం రాత్రి 11 గంటలకు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై బుధవారం రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు విచారణ చేశారు. రాజేష్‌పై ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీఐ ఆదేశించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



మేదరమెట్ల (అద్దంకి): మేదరమెట్ల వై. జంక్షన్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ దగ్గరలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ మహ్మద్ రఫీ బుధవారం తెలిపారు. పాఠశాలలో పని చేస్తున్న కూలీలు శవాన్ని చూసి స్థానిక రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారి సమాచారం మేరకు ఎస్ఐ అక్కడకు వెళ్లి వివరాలు సేకరించారు. ఆచూకీ తెలియక పోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. మృతుడు వయస్సు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండొచ్చని చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు పేర్కొన్నారు.

ప్రత్యేక రైళ్ల కేటాయింపు

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లను కేటాయించినట్లు గుంటూరు డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్ కుమార్ బుధవారం తెలిపారు. నంబర్ 08579 విశాఖపట్నం - చర్లపల్లి రైలు ఈ నెల 25 నుంచి మే 30వ తేదీ వరకు నడుస్తుందని పేర్కొన్నారు. 08580 చర్లపల్లి - విశాఖపట్నం రైలు ఈ నెల 26 నుంచి మే 31వ తేదీ వరకు నడపనున్నట్లు తెలిపారు. ఈ రైలు దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తణుకు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదుగా ప్రయాణిస్తుందని ఆయన వివరించారు.

కావ్యేషు నాటకం రమ్యం

- మార్టూరు కళాపరిషత్తుకు 15 వసంతాలు
- గ్రామీణ ప్రాంత ప్రజల చైతన్యమే లక్ష్యంగా అవిశ్రాంత నిర్వహణ
- నేటి నుంచి మార్టూరులో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో నాటికల పోటీలు



మిత్ర బృందం తరఫున మోహనరావుకు నగదు అందజేస్తున్న శానంపూడి లక్ష్మయ్య

మార్టూరు: కావ్యేషు నాటకం రమ్యం అన్నారు పెద్దలు. అన్ని కళల్లో నాటకం ప్రాధాన్యతకు ఇది అద్దం పడుతుంది. ఒకప్పుడు వెలుగు వెలిగిన నాటక రంగం నేడు మిణుకు మిణుకుమంటోంది. సినీ, టీవీ మాధ్యమాలతో వెలవెలబోతోంది. ప్రజల ఆదరణ కూడా తగ్గింది. నాటక పరిషత్‌లు జవసత్వాలు కల్పిస్తున్నా, వాటి నిర్వహణ వ్యయ ప్రయాసలతో కూడుకుంది. ప్రదర్శనల వల్ల వ్యయమే తప్పా ఆదాయం రాని పరిస్థితి. ఈ నేపథ్యంలో మార్టూరుకు చెందిన శ్రీకారం రోటరీ కళా పరిషత్తు 15 సంవత్సరాలుగా నిరంతరంగా నాటక పోటీలు నిర్వహిస్తోంది. నటులను ప్రోత్సహించడంతో పాటు ఆలోచింపజేసే నాటికలతో జనరంజకంగా సాగుతోంది. ఏప్రిల్ 24, 25,26 తేదీల్లో మార్టూరు మద్ది సత్యనారాయణ కంపెనీ ఆవరణలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో 15వ నాటికల పోటీలు నిర్వహిస్తోంది.

శ్రీకారం రోటరీ కళా పరిషత్ ఆవిర్భావం

ప్రపంచవ్యాప్తంగా సేవారంగంలో వ్యాపించి ఉన్న రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ మార్టూరు శాఖ ఇక్కడ కళారంగంలో అడుగుపెట్టడం విశేషం. స్థానికంగా ఉన్న శ్రీకారం స్వచ్ఛంద సేవా సంస్థతో కలిసి ఒక టిన్నర దశాబ్దాలుగా మార్టూరులో శ్రీకారం రోటరీ కళాపరిషత్ పేరుతో పరిషత్తు నాటికల పోటీలు నిర్వహిస్తోంది. ఈ పరిషత్తు ద్వారా నటుల్ని, నాటికలను మాత్రమే ప్రోత్సహించడమే కాకుండా రాష్ట్రంలో వివిధ రంగాలలో ప్రజలకు విశిష్ట సేవలు అందిస్తున్న ప్రముఖ వైద్యులు, క్రీడాకారులు, కళాకారులు, సామాజిక కార్యకర్తలను సన్మానిస్తోంది.

కళా పరిషత్తుకు అండగా జేవీ

మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందిన జాష్టి వెంకట మోహన్‌రావు (జె.వి) ఆయన భార్య అనూరాధ దంపతులు మార్టూరు కేంద్రంగా స్థాపించిన ఎఫర్ట్ స్వచ్ఛంద సంస్థ మూడు దశాబ్దాలుగా నడుస్తోంది. ప్రజలకు ముఖ్యంగా రైతులకు నిర్మాణాత్మక సేవలు అందిస్తోంది. రైతులకు మాత్రమే కాకుండా సమాజంలోని అన్ని రంగాలకు ఉపయోగపడాలనే జేవీ ఆశయం నుంచి ఆవిర్భవించిందే ఈ కళాపరిషత్తు. విశ్రాంత అధ్యాపకులు, నటుడు, రచయిత, దర్శకుడు అయిన మండలంలోని కోలలపూడి గ్రామానికి చెందిన కందిమళ్ల సాంబశివరావు, జాష్టి అనూరాధ అధ్యక్ష, కార్యదర్శులుగా 15 సంవత్సరాల కిందట మార్టూరు రోటరీ క్లబ్‌తో కలిసి శ్రీకారం రోటరీ కళాపరిషత్‌ను స్థాపించారు.

నిర్వహణ కోసం శాశ్వత నిధి

నాటకాలు సామాజిక స్పృహను కల్పించడంతో కీలకపాత్ర పోషిస్తాయని నమ్మిన జేవీ భవిష్యత్తులో ఎలాంటి అవరోధాలు ఏర్పడకుండా ఈ కళాపరిషత్ నిరాటంకంగా కొనసాగేందుకు గాను 2018లో శాశ్వత నిధిని ఏర్పాటు చేయడం విశేషం.

సామాజిక సమస్యల పరిష్కార వేదిక నాటక రంగం



సమాజంలోని రుగ్మతలను ఎత్తి చూపి వాటి పరిష్కారాలను కళ్లకు కట్టినట్లు చూపగలిగేది నాటిక మాత్రమే. మా పరిషత్తు ద్వారా సమాజంలోని కొంతమందిలోనైనా మార్పు తీసుకురాగలిగితే మా ప్రయత్నం సఫలమైనట్లే. రోటరీ క్లబ్‌తో కలిసి ప్రయాణం చేయడం, స్థానికులు, దాతల ప్రోత్సాహంతో పరిషత్తును విజయవంతంగా నిర్వహించగలుగుతున్నాం. ఈ పరంపరను ఇలాగే కొనసాగిస్తాం.

–జె. వి.మోహనరావు, డైరెక్టర్, ఎఫర్ట్ స్వచ్ఛంద సంస్థ

నాటికలతో సాంత్వన

రోజురోజుకూ యాంత్రికత పెరిగిపోతున్న మనిషి జీవితంలో ఆటవిడుపునకు నాటకాలు ఎంతో దోహదపడతాయి. ఒత్తిడిని మరిచిపోయి, జీవితంలో ఏమి కోల్పోతున్నామో తెలుసుకోగలుగుతాం. ఏటా ఏప్రిల్ 24, 25, 26 తేదీల్లో పరిషత్ ఆధ్వర్యంలో నాటికల ప్రదర్శనలు నిర్వహిస్తున్నాం. గ్రామీణ ప్రాంత ప్రజలకు చేరువలో పరిషత్తు నిర్వహణ గర్వించదగ్గ విషయం.

–శానంపూడి లక్ష్మయ్య, మార్టూరు రోటరీ క్లబ్ సభ్యులు

నేటి నుంచి రీజినల్ వాలీబాల్ స్పోర్ట్స్ మీట్

- హాజరుకానున్న 25 జట్లు
- సత్తెనపల్లిలో నాలుగు రోజుల పాటు పోటీలు
- 27న జాతీయ స్థాయి వాలీబాల్ జట్టు ఎంపిక



వాలీబాల్ పోటీలకు సిద్ధమైన క్రీడా మైదానం

సత్తెనపల్లి: క్రీడల పండుగకు రంగం సిద్ధమైంది. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ (రామకృష్ణాపురం) ప్రాంగణంలో కెవిస్ హైదరాబాద్ రీజినల్ స్థాయి అండర్-17 బాలబాలికల వాలీబాల్ స్పోర్ట్స్ మీట్ గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఈ నెల 24 నుంచి ప్రారంభమయ్యే కెవిస్ హైదరాబాద్ రీజినల్ స్థాయి వాలీబాల్ స్పోర్ట్స్‌మీట్ ఈ నెల 27 వరకు నాలుగు రోజుల పాటు హోరాహోరీగా సాగనున్నాయి. దీనికిగాను 8 బాలికల జట్లు, 17 బాలుర జట్లు కలిపి మొత్తం 25 బాలబాలికల జట్లు తెలుగు రాష్ట్రాల నుంచి హాజరుకానున్నాయి. బాలికల విభాగం నుంచి హైదరాబాద్, విశాఖపట్నం, ఖమ్మం, విజయవాడ, తెనాలి, హకీంపేట, బొల్లారం, సత్తెనపల్లి, బాలుర విభాగానికి సంబంధించి విజయవాడ-1, విజయవాడ -2, ఒంగోలు, తెనాలి, కర్నూలు, వాల్తేరు, బొల్లారం, కంచనబాగ్, హకీంపేట, సత్తెనపల్లి, హైదరాబాద్, సీఆర్పీఎఫ్, బార్‌కాన్, పికెట్, సూర్యలంక, ఖమ్మం నుంచి జట్లు రానున్నాయి. ఈనెల 24, 25న అండర్-17 బాలికలకు, ఈ నెల 26, 27న అండర్-17 బాలురకు పోటీలు జరుగుతాయి. జూలైలో పంజాబ్‌లో జరిగే జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల జట్టును ఈ నెల 27న ఎంపిక చేయనున్నారు. క్రీడా పోటీలకు మొత్తం 260 మంది బాలబాలికలు, 40 మంది కోచ్‌లు, ఇతర అఫీషియల్స్ హాజరుకానున్నారు.

పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య

ఫిరంగిపురం: పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత కానందుకు మనస్తాపానికి గురైై విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పి.వినయకుమార్ (16) స్థానికంగా ఓ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించలేదు. మనస్తాపానికి గురైై తన తాత పాపయ్య ఇంటికి వచ్చి ఫ్యాన్‌కు ఉరి వేసుకొన్నాడు. చుట్టు పక్కల వారు గమనించి విద్యార్థిని స్థానికంగా ఉన్న ప్రయివేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యుడు తెలిపారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు విలపిస్తున్నారు.

విద్యార్థిని రక్షించిన పోలీసులు



తాడేపల్లి రూరల్ : 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో మార్కులు తక్కువ వచ్చాయని ఓ విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేస్తుండగా బుధవారం తాడేపల్లి పోలీసులు కాపాడి తల్లిదండ్రులకు అప్పగించారు. సీఐ కల్యాణ్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన ఓ విద్యార్థికి 10 తరగతిలో తక్కువ మార్కులు వచ్చాయని మనస్తాపం చెంది తల్లిదండ్రులకు చెప్పకుండా ఇంటి నుండి వచ్చాడన్నారు. తల్లిదండ్రులు అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అక్కడి సీఐ అప్రమత్తమై విద్యార్థి వద్ద సెల్‌ఫోన్ ఆధారంగా లొకేషన్ కనిపెట్టి తాడేపల్లి పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. నాలుగు బృందాలుగా తాడేపల్లి పోలీసులు వెతకగా తాడేపల్లి కృష్ణాకెనాల్ రైల్వే స్టేషన్ పరిధిలో ఉన్నట్లు గుర్తించారు. వారి తల్లిదండ్రులను పిలిపించి అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌కు పంపినట్లు సీఐ కల్యాణ్ రాజు తెలిపారు.

నకిలీ ఉద్యోగాల ముఠాపై ఫిర్యాదు



తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లిలో జనసేన పేరుతో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ పలువురు నిరుద్యోగులను నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై బుధవారం జనసేన నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జనసేన తాడేపల్లి రూరల్ అధ్యక్షుడు సామాల నాగేశ్వరరావు, తాడేపల్లి పట్టణ సీనియర్ నాయకుడు అంబటి తిరుపతిరావు మాట్లాడుతూ ఉండవల్లి సెంటర్‌లో శివ అనే వ్యక్తి ఇల్లు అద్దెకు తీసుకుని జనసేన ఎంపీ, మంత్రుల పేర్లు చెప్పి ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ దరఖాస్తులు స్వీకరిస్తూ, నగదు వసూలు చేస్తున్నాడని తమ దృష్టికి వచ్చిందన్నారు. శివకు, అతని వెనుక ఉన్న ముఠాతో పార్టీకి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. పోలీసులు కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ఐటీ కోఆర్డినేటర్ చల్లాకుల కోటేష్, నియోజకవర్గ నాయకులు జొన్న రాజేష్, ఉండవల్లి గ్రామ అధ్యక్షులు రాజా రమేష్ పాల్గొన్నారు.

ఫొటోలు మార్ఫింగ్ చేసి యువతికి బెదిరింపులు

మంగళగిరి: నగర పరిధిలోని ఓ గ్రామానికి చెందిన యువతిని అదే గ్రామానికి చెందిన యువకుడు ప్రేమ పేరుతో వేధిస్తున్న ఘటన చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఓ గ్రామానికి చెందిన యువతి బీ ఫార్మసీ పూర్తి చేసుకుని యూఎస్ వెళ్లడానికి సన్నాహాలు చేసుకుంటోంది. ఆమెకు తుళ్లూరు మండలానికి చెందిన ఓ వ్యక్తితో వివాహం చేయాలని పెద్దలు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన యువకుడు కంచర్ల మానిష్కర్ ఆమె ఫొటోలను మార్ఫింగ్ చేసి వరుడి ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్టు చేస్తున్నాడు. వరుడు ఈ విషయాన్ని యువతి తల్లిదండ్రుల దృష్టికి తీసుకొచ్చారు. పూర్తి ఆధారాలు సేకరించిన వారు బుధవారం మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యార్డులో 1,29,798 బస్తాలు మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు):గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,22,419 బస్తాల మిర్చి రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,29,798 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.13,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.9,800 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.6,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 58,020 బస్తాలు నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

ధూళిపాళ్లలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



సత్తెనపల్లి: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల గ్రామంలో బుధవారం లభ్యమైంది. గ్రామంలో మృతదేహం ఉందని స్థానికులు సత్తెనపల్లి రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలాన్ని సందర్శించి పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. సుమారు 35-40 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి మృతదేహంపై మెరూన్ రంగు టీ షర్ట్, దానిపై ఎవరెస్ట్ అని ప్రింట్ చేసి ఉంది. గ్రే రంగు పాయింటు ధరించి ఉన్నాడు. నలుపు రంగు బెల్టు ఉండి బెల్ట్ బకెట్ ఆరంజ్, నలుపు రంగులో ఉంది. మృతుడి మెడకి రెండు తాయిత్తులు, కుడి చేతికి రబ్బర్ బ్యాండ్, నడుముకు నాలుగు పేటల నలుపు, ఎరుపు రంగుల మొలతాడు ఉంది. మృతుడు పొడవు సుమారు 5 అడుగుల 2 అంగుళాలు, నలుపు రంగులో ఉన్నాడు. వివరాలు తెలిసినవారు సత్తెనపల్లి రూరల్ సీఐ 94407 96231, సత్తెనపల్లి రూరల్ ఎస్ఐ 80199 98643 నెంబర్లకు తెలియచేయాలని పోలీసులు కోరారు.

చిలకలూరిపేట డిపో నుంచి హైదరాబాద్‌కు ఇంద్ర బస్సులు

నకరికల్లు, పిడుగురాళ్ల, దాచేపల్లి డిపోల నుంచి రిజర్వేషన్ సౌకర్యం

చిలకలూరిపేట టౌన్: చిలకలూరిపేట డిపో నుంచి హైదరాబాదు – బీహెచ్ఈఎల్ ఏసీ బస్సులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తున్నట్లు డీఎం ఎస్.రాంబాబు బుధవారం తెలిపారు. హైదరాబాద్, బీహెచ్ఈఎల్ మార్గాల్లో పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని కొత్తగా రిజర్వేషన్‌ను ప్రారంభించామన్నారు. ఇందులో భాగంగా చిలకలూరిపేట నుంచి హైదరాబాద్ (మియాపూర్, ఈసీఐఎల్, బీహెచ్ఈఎల్) సెక్టార్లో ఇంద్ర ఏసీ బస్సులు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. పట్టణ డిపో నుంచి ఏడు సర్వీసులు, అక్కడి నుంచి తిరిగి వచ్చేందుకు ఏడు సర్వీసులు ఉన్నాయన్నారు. చిలకలూరిపేట నుంచి హైదరాబాద్‌కు డిపోనుంచి ఆయా సర్వీసులకు నకరికల్లు, పిడుగురాళ్ల, దాచేపల్లిలో సీట్లను సులభంగా బుక్ చేసుకోవచ్చని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచండి

జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తమం



విద్యార్థులకు ఆరవ తగరతిలో ప్రవేశాలు కల్పిస్తున్న డీఈఓ

యద్దనపూడి: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాలు పెంచేందుకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తమం తెలిపారు. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా బుధవారం మండలంలోని పూనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఆరవ తరగతిలో 28 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఐదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులను ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఆరవ తరగతిలో చేర్పించేలా హెచ్‌ఎంలతో పాటు ఉపాధ్యాయులు, సీఆర్పీలు, విద్యాశాఖాధికారులు సమష్టిగా కృషి చేయాలని ఆదేశించారు. ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లిన విద్యార్థులను తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని చెప్పారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయుల శిక్షణలో చిన్నారుల బంగారు భవిష్యత్ ఉన్నతంగా తీర్చిదిద్దుతామనే నమ్మకాన్ని తల్లిదండ్రులకు కలిగించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న రుచికరమైన మధ్యాహ్న భోజనం, ఉచిత యూనిఫాం, పుస్తకాలు, నోట్స్ పుస్తకాలు, షూ తదితర మౌలిక వసతుల గురించి అవగాహన కల్పించాలని తెలిపారు.అనంతరం పాఠశాలలోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ ఈఓ డి. గంగాధర్, ఎంఈఓ -2 చిలుకూరి గోపి, ప్రధానోపాధ్యాయుడు ఏఎం . శ్రీనివాసరావు ,హెచ్‌ఎం రాఘవరెడ్డి, మాజీ సర్పంచ్ బోయపాటి సాంబశివరావు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు



సామగ్రి అందుకుంటున్న ఎన్‌సీసీ క్యాడెట్లు, ఉపాధ్యాయులు

వేటపాలెం: విద్యార్థులు ఎన్‌సీసీలో చేరడం ద్వారా ఉన్నత చదువులు, ఉద్యోగాల్లో రిజర్వేషన్ పొందే అవకాశం ఉందని ప్రధానోపాధ్యాయుడు ఎం. శేఖరరావు తెలిపారు. పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎన్‌సీసీ క్యాడెట్స్‌కి సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరిన 43 మంది విద్యార్థులకు ప్రభుత్వం నుంచి ఒక్కొక్కరికీ రూ.4,400 చొప్పన రూ.1,89,200 మంజూరైనట్లు తెలిపారు. ఈ నగదుతో ఒకొక్క క్యాడెట్‌కి రెండు జతల సూట్లు, రెండు జతల బూట్లు, రెండు టీ షర్టులు, బెల్టు, నేమ్ ప్లేట్, లైన్ యార్డ్ అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులు ఎన్‌సీసీలో చేరడం వల్ల దేశభక్తి, క్రమశిక్షణ, త్యాగం, ధైర్యం అలవడి సమాజ సేవలో ఉత్సాహంగా పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్. లలితా పరమేశ్వరి, ఉమ్మిటి వేణుగోపాలరావు, సీహెచ్. భవానీదేవి, వి.ఎల్. నరసింహం, బుద్ధి మోహనరావు, ఎద్దు రత్నం, గుంటూరు శివశంకర్, చైతన్య పాల్గొన్నారు.

లాం ఫాంలో సలహా మండలి సమావేశం



ప్రచురణలను ఆవిష్కరిస్తున్న వీసీ డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మీదేవి తదితరులు

గుంటూరు రూరల్: కృష్ణా మండలం వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం బుధవారం నిర్వహించారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, లాంఫాం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వ్యవసాయ శాఖలు సంయుక్త ఆధ్వర్యం వహించాయి. నగర శివారుల్లోని లాంఫాం నందున్న సమావేశ మందిరంలో రెండు రోజులపాటు జరిగే ఈ సమావేశానికి పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్. శారద జయలక్ష్మీదేవి మాట్లాడుతూ రైతుల సలహాలు, సూచనలు దృష్టిలో ఉంచుకుని పరిశోధన ప్రణాళికలు తయారు చేయాలని తెలిపారు. నూతన వంగడాలపై ఫీడ్ బ్యాక్ రైతుల నుంచి తీసుకోవాలన్నారు. సహజ వనరుల పొదుపు, నేల ఆరోగ్యం వంటి పలు అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. కృష్ణా మండలంలో నిష్ణాతులైన రైతుల ద్వారా సాగు సమస్యలు, సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. విస్తరణ సంచాలకులు డాక్టర్ జి. శివన్నారాయణ మాట్లాడుతూ జిల్లా వనరులు, అవసరాలు, పరిస్థితులు దృష్టిలో ఉంచుకుని నూతన పరిశోధనలు జరపాలని చెప్పారు. రైతులు విత్తన రకాలపై కాకుండా పంటల్లో యాజమాన్య పద్ధతులపై దృష్టి సారించాలని కోరారు. వివిధ జిల్లాల వ్యవసాయ అధికారులు ఆయా ప్రాంతాల పంటల స్థితిగతులు, పంటల యాజమాన్యం, మినీ కిట్ల పనితీరు గురించి వివరించారు. వచ్చే ఏడాదిలో చేపట్టాల్సిన పరిశోధనలకు దిశానిర్దేశం చేశారు. కేవీకే ఘంటశాల, గరికపాడులతో తయారు చేసిన పలు రకాల ప్రచురణలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఆరు జిల్లాల వ్యవసాయ శాఖల అధికారులు, 12 పరిశోధన స్థానాలు, ఆరు విస్తరణ యూనిట్లు శాస్త్రవేత్తలు, వివిధ పంటల ప్రధాన శాస్త్రవేత్తలు, డీఆర్‌సీ అధికారులు, ఆరు జిల్లాల అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

పట్టపగలు బస్టాండ్ సెంటర్‌లో నగదు అపహరణ

- రూ. 5 లక్షలున్న బ్యాగ్‌ను ఎత్తుకుపోయిన గుర్తు తెలియని వ్యక్తులు
- డీఎస్పీ మోయిన్ విచారణ



సంఘటనా స్థలంలో విచారిస్తున్న డీఎస్పీ మోయిన్

అద్దంకి రూరల్: పట్ట పగలు అందరూ చూస్తుండగానే మెయిన్ సెంటర్ బస్టాండ్ వద్ద రోడ్ పక్కన నిలిపిన బైకు కవర్‌లో నుంచి నగదు బ్యాగ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించి పరారైన సంఘటన బుధవారం అద్దంకిలో కలకలం రేపింది. సీఐ సుబ్బరాజు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బల్లికురవ మండలం కూకట్లపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి వివాహ పనుల నిమిత్తం బుధవారం రూ. 3 లక్షలు తీసుకుని అద్దంకికి వచ్చాడు. దీనికి తోడుగా మరో రూ. 2 లక్షలను బ్యాంకు నుంచి డ్రా చేసి తీసుకున్నాడు. మొత్తం రూ. 5 లక్షలను ఒక బ్యాగ్‌లో పెట్టి బైకు ట్యాంకులో ఉంచి టిఫిన్ చేసేందుకు అద్దంకి బస్టాండ్ సమీపంలోని బండి వద్దకు వచ్చాడు. బైకు దిగి టిఫిన్ చేశాడు. చేతులు కడుక్కునేందుకు పక్కకు తిరిగిన సమయంలో గుర్తు తెలియని యువకుడు వచ్చి బైకు కవర్‌లో ఉన్న నగదును తీసుకున్నాడు. వెంటనే వేరొక యువకుడు బైకు మీద రావడంతో దాన్ని ఎక్కి పరారయ్యాడు. సమాచారం తెలుసుకున్న డీఎస్పీ మోయిన్ బుధవారం రాత్రి అద్దంకిలోని సంఘటనా స్థలానికి వచ్చి అక్కడి వారిని దొంగతనం జరిగిన తీరును విచారించారు. దొంగలను వెంటనే పట్టుకుంటామని చెప్పారు. నగదు, విలువైన వస్తువులు తీసుకెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. ఆయన వెంట సీఐ సుబ్బరాజు, ఎస్ఐ రవితేజ, సిబ్బంది ఉన్నారు.

చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు అరెస్టు



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సౌత్ డీఎస్పీ భానోదయ

గుంటూరు రూరల్: చిరునామా అడుగుతున్నట్లు నటించి చైన్ స్నాచింగ్‌లకు పాల్పడే మామా అల్లుళ్లను నల్లపాడు పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం అడవితక్కెళ్ళపాడులోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సౌత్ డీఎస్పీ భానోదయ ఈ కేసుకు సంబంధించిన వివరాలను తెలిపారు. పాతగుంటూరు యాదవ బజారుకు చెందిన బాణావత్ బద్రునాయక్, పల్నాడు జిల్లా మాచర్ల మండలం చింతలతండా గ్రామానికి చెందిన కేతావత్ శరత్‌లు మేనమామ, మేనల్లుడు. నగరంలో ఆటోలు నడుపుతూ వ్యసనాలకు బానిసలయ్యారు. సులువుగా డబ్బు సంపాదించేందుకు చైన్ స్నాచింగ్‌లను ఎన్నుకున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళుతూ ఒంటరిగా వెళుతున్న మహిళలను అడ్రస్ అడుగుతున్నట్లు నటించి చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతూ పారిపోయేవారు. ఈ క్రమంలో ఈ నెల 19వ తేదీన ఇన్నర్ రింగ్‌రోడ్డులో ఓ మహిళ మెడలోని 20 గ్రాముల బంగారు చైన్‌ను ఇదే తరహాలో లాక్కెళ్లారు. నల్లపాడు సీఐ వంశీధర్ కేసు దర్యాప్తు ప్రారంభించారు. బుధవారం ఉదయం వై జంక్షన్ వద్ద తిరుగుతున్న ఇరువురిని అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా నిందితులు నేరాన్ని అంగీకరించారు. వారి నుంచి పోలీసులు 20 గ్రాముల బంగారం, నిందితులు ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వారిని కోర్టులో హాజరుపరిచామని డీఎస్పీ తెలిపారు. కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన డీఎస్పీ, సీఐని, ఎస్ఐ వాసు, సిబ్బంది సుబ్బారావు, మస్తాన్‌వలి, నరుల్లాలను జిల్లా ఎస్పీ అభినందించారు.